క్లుప్తంగా

పేదలకు అన్నదానం



గురజాల: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగివుండాలని టీడీపీ నాయకుడు పులుకూరి కాంతరావు అన్నారు. స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జంగమహేశ్వరపురంకు చెందిన ఎనుముల రామకృష్ణారెడ్డి, లక్ష్మీ ప్రసన్నలు అన్నదానం నిర్వహించారు. స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీ విశ్వనాథం, టీడీపీ నాయకులు గడిపూడి పెద్ద చెన్నయ్య, మద్దినేని లక్ష్మీనారాయణ, శివనాగు, ఫౌండేషన్ సభ్యుడు బండి రవికుమార్, కె.హనుమంతరావు తదితరులున్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మాచవరం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వలన అనేక అనర్థాలు కలుగుతాయని ఎస్ఐ కె.సతీష్ అన్నారు. స్థానిక జీకే విద్యాసంస్థల శ్రీవిజేత జూనియర్ కాలేజీలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే నష్టాలు, మైనర్ల డ్రైవింగ్, అసాంఘిక కార్యకలాపాలు తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం వలన యువకులకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, జీవితాలు చిన్నాభిన్నమవుతాయని, దానితో కుటుంబాలు ఎంతో నష్టపోవాల్సి వస్తుందని తెలియజేశారు. డ్రగ్స్ వాడకం చట్టరీత్యా నేరమని, వాటిని కలిగిఉన్నట్లయితే చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలియజేశారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం నేరమని, ముఖ్యంగా మైనర్లు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నడపరాదని తెలిపారు. విద్యార్థులు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి , విద్యలో రాణించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కారెంపూడి: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో కారెంపూడిలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంకాలమ్మ గుడిసెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుసా రామాంజనేయులు, మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టరూ..!



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్‌నగర్‌లో మంచినీటి కుళాయికి ట్యాప్ లేకపోవటంతో విలువైన మంచినీరు వృథాగా పోతోంది. లెనిన్ నగర్ వెళ్లే దారిలోనే సిమెంట్ రోడ్డు కుడివైపున మంచినీటి కుళాయి ఏర్పాటు చేశారు.ఉదయం, సాయంత్రం కృష్ణాజలాలు విడుదల చేస్తున్నారు. అయితే ట్యాప్ లేకపోవటంతో కృష్ణా జలాలు నిరంతరం వృథాగా మురుగుకాల్వలోకి పోతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు



నరసరావుపేట రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ పసుపులేటి రామకృష్ణ తెలిపారు. పట్టణ శివారు ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవిస్తున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో రూరల్ పోలీసులు చర్యలు ప్రారంభించారు. కోటప్పకొండ రోడ్డులోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో యువకులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సి.హెచ్.కిశోర్‌లు మంగళవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ముళ్లపొదలు తొలగించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అలాగే కోటప్పకొండ సమీపంలోని కెనాల్ మలుపు వద్ద పిచ్చిమొక్కల పెరిగి రోడ్డు ప్రమాదకరంగా మారడంతో జేసీబీతో పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో పాటు కోటప్పకొండ రోడ్డు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మంచం పట్టిన జగ్జీవన్‌రామ్ కాలనీ



జ్వరంతో బాధపడుతున్న కాలనీవాసి మౌలాలి

- కాలనీలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- జ్వరంతో వ్యక్తి మృతి
- అధ్వానంగా పారిశుద్ధ్యం..
- దోమల నిలయంగా మురుగుకాల్వలు
- పట్టించుకోని అధికారులు



సిల్ట్ తీయక దోమలకు నిలయంగా మారిన మురుగు కాలువ

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం సమీపంలోని జగ్జీవన్‌రామ్ కాలనీలో గత వారం రోజుల నుంచి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరంతో ఈ కాలనీకి చెందిన రాయపాటి మోషే(48) మృతిచెందాడు. గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న మోషే పూర్తిస్థాయిలో వైద్య సేవ లు అందక, ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించుకోలేక జ్వరం తగ్గకపోవటంతో మంగళవారం మృతి చెందాడు. దీంతో జగ్జీవన్‌రామ్ కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

తీసికట్టుగా పారిశుద్ధ్యం..

జగ్జీవన్‌రామ్ కాలనీ పిడుగురాళ్ల పట్టణానికి సమీపంలో ఉంది. ఇటు మండలంలోని జానపాడు గ్రామ శివారులో ఉండటంతో కాలనీ వాసులకు జానపాడు గ్రామ పంచాయతీ నుంచి కానీ, ఇటు పిడుగురాళ్ల పట్టణం నుంచి కానీ మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందడం లేదు. దీంతో కాలనీ అభివృద్ధికి నోచుకోలేదు. ఈ క్రమంలోనే పారిశుద్ధ్యం అధ్వానంగా తయారై, దోమలకు నిలయమై, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి.

ఒక్క మాత్ర ఇచ్చినవారు లేరు..

కాలనీలో సుమారు 400 గృహాలు ఉన్నాయి. ఇప్పటికే సుమారు 15నుంచి 20 మంది జ్వర పీడితులు ఉన్నారు. ఈ గృహాలలోని ప్రజలు రోజు వారి కూలి పనులకు వెళ్లేవారే. పేదవారైన వీరందరికీ ప్రభుత్వ వైద్యశాలల్లోని వైద్యమే దిక్కు. అయితే జ్వరపీడితులు అధికంగా ఉంటున్నా, ఇప్పటికే ఒకరు మృతిచెందినా ఒక్కరంటే ఒక్కరు కూడా వైద్యసిబ్బంది కాలనీని దర్శించి, ఒక్కమాత్ర సైతం అందివ్వలేదని కాలనీవాసులు వాపోతున్నారు. అంతేకాకుండా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండి, ఎక్కడి చెత్త అక్కడే పోగయి, మురుగుకాల్వల్లో సిల్టు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారినా.. బ్లీచింగ్ చల్లిన నాథుడు సైతం లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు లేవు



ఈ కాలనీలో గత పదేళ్లుగా ఉంటున్నాం. ఇక్కడ సైడు కాలువలు లేవు, కనీసం దోమల నివారణకు మందు చల్లేవారు లేరు. కాలనీలో జ్వరాలు ఎక్కువ మందికి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. పీహెచ్‌సీల్లో సరిగా చూడడం లేదు. ప్రైవేటు హాస్పటల్‌కు వెళ్లాలంటే డబ్బులు లేక వెళ్లపోలేకపోతున్నాం. రక్త పరీక్షకే రూ. 700 నుంచి 800 వరకు తీసుకుంటున్నారు. మిగతా వైద్యానికి కనీసం రూ.2 వేలు అవుతున్నాయి. జ్వరాలు తగ్గటం లేదు.

– పేరమ్మ, జగ్జీవన్‌రామ్ కాలనీ


ట్యాబ్లెట్ కూడా ఇవ్వలేదు



ఈ ప్రాంతంలో నివసించే వారందరూ పేదలే. ఉండటానికి ఇళ్లు కూడా సక్రమంగా లేవు. మా కాలనీ జానపాడు శివారులో ఉందని కనీసం గ్రామ పంచాయతీ అధికారులు కూడా రావటం లేదు. జ్వరాలతో వృద్ధులు, చిన్నారులు అందరు మంచాన పడ్డారు. కనీసం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ట్యాబ్లెట్ ఇచ్చేందుకు కూడా వైద్యసిబ్బంది ఎవరూ ఇంతవరకు రాలేదు.

– ఫిలిఫ్, జగ్జీవన్ రామ్ కాలనీ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణేశ్వరి అమ్మవారు

మాచర్ల: శ్రావణమాసం సందర్భంగా మంగళవారం శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి దేవాలయం, చంద్రవంక బ్రిడ్జి వద్ద ఆదిలక్ష్మి, పలు ప్రాంతాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సొసైటీ కాలనీలో వేంచేసియున్న మాతా అన్నపూర్ణేశ్వరి, గాయత్రిదేవి మాతను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గురవయ్య, భాస్కర్, అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, తదితరులు పాల్గొన్నారు. చంద్రవంక బ్రిడ్జి ఆలయ అధ్యక్షుడు శ్రీనివాసరావు, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



రెంటచింతలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, మలేరియా అధికారులు

మాచర్ల: దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు లేని సమాజాన్ని తయారు చేయాలని నినాదాలు చేశారు. మలేరియా వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం, 8వ వార్డులో, నెహ్రూనగర్‌లోని ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

రెంటచింతలలో...

రెంటచింతల: గ్రామాలలో నివాస ప్రాంతాల్లో మురికి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టి దోమలను పారద్రోలి, ఆరోగ్యాన్ని కాపాడుకుందామని మలేరియ సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ అంకమ్మరావు అన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రోస్ జయంతి పురస్కరించుకుని మంగళవారం ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన రెంటచింతలలోని పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని పలు కాలనీలలో వైద్యాధికారులు, మలేరియా అధికారులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయాలలో దోమలు ఉధృతంగా ఉంటాయని ఇళ్లలో పాతటైర్లు, కొబ్బరిబోండాలను తొలగించాలని కూలర్‌లలోని నీటిని వారానికి ఒకసారి మార్చుకోవాలన్నారు. దోమల వలన విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. జ్వరం వచ్చిన వెంటనే స్థానిక పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవాలని ఆయన కోరారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, డాక్టర్ హేమ, ఎంపీహెచ్ఓ శర్మ, హెల్త్ సూపర్ వైజర్స్ ఎస్.కోటేశ్వరరావు, ఎ.ఆంజనేయులు, ఆరోగ్య, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీగా గార్లపాటి అనసూయ

ఉత్తర్వులు జారీచేసిన జిల్లా పరిషత్ అధికారులు



పిడుగురాళ్లరూరల్: జూలకల్లు–1 ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ గార్లపాటి అనసూయ వెంకటేశ్వర రెడ్డి ఎంపీపీగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కాశయ్య మంగళవారం ఎంపీపీ గార్లపాటి అనసూయకు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అధికారులతో, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామని ఆమె అన్నారు. అనంతరం ఆమెను ఎంపీటీసీలు సన్మానించారు.

ఏఆర్‌టీ మందులు క్రమం తప్పక వాడాలి

కారెంపూడి: హెచ్ఐవీ, టీబీ వ్యాధులున్నవారు ఎట్టి పరిస్థితులో వాడుతున్న ఏఆర్‌టీ మందులను ఒక్కరోజు కూడా ఆపవద్దని అలా ఆపితే ప్రమాదమని న్యాకో సంస్థ రీజినల్ కో–ఆర్డినేటర్ ఎం.విశ్వేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం కింద పేటసన్నెగండ్ల, చింతపల్లి గ్రామాలలో అవగాహన సదస్సులను మంగళవారం నిర్వహించారు. హెచ్ఐవీ సోకిన వారు టీబీ వ్యాధి ఉన్నవారు మరణమే శరణ్యమని అనుకునే రోజులు పోయాయని వారు కూడా మందులు వాడుకుంటూ దీర్ఘకాలం జీవించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆ సంస్థల ప్రతినిధులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ స్కౌట్స్ మాస్టర్‌కు సన్మానం

నరసరావుపేట రూరల్: ఉత్తమ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లీడర్ ట్రెయినర్‌గా అవార్డు పొందిన శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ స్కౌట్స్ ఉపాధ్యాయుడు పమ్మి వెంకటరెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, ఉపాధ్యాయులు వెంకటరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయినీ పార్వతి మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా స్కౌట్ ఉపాధ్యాయుడిగా వెంకటరెడ్డి విశేషసేవలు అందించారని తెలిపారు. ఎం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదగా అవార్డు పొందడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో రాజీవ్ ధ్రువతార



జెట్టిపాలెంలో రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

రెంటచింతల: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశరాజకీయాలలో ఒక ధ్రువతార అని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. మంగళవారం రాజీవ్ గాంధీ 80వ జయంతిని పురస్క రించుకుని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని రెంటచింతల, జెట్టిపాలెం గ్రామాలల్లో రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షుడు జె. శ్రీనునాయక్, పార్టీ సీనియర్ నాయకుడు కర్నాటి కోటయ్య మాట్లాడుతూ దేశం సాంకేతికరంగంలో అభివృద్ధి చెందేందుకు రాజీవ్ చేసినసేవలు మరువలేనివని కొనియాడారు. అనంతర మిఠాయిలను పంపిణీచేశారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాస్, పార్టీ నాయకులు బత్తుల జాకబ్‌రాజు, కొమ్ము మునలయ్య తదితరులున్నారు.

కొండవీడు ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహణ



హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారితో డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర డాక్టర్లు

నరసరావుపేట: జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో 40 మందికి రూ.10 లక్షల విలువైన చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్రచికిత్సలు ఉచితంగా చేసినట్లు రెడ్‌క్రాసు జిల్లా అధ్యక్షులు, హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం వెల్లడించారు. 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15న హాస్పిటల్‌లో ఈఎన్‌టీ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ వైద్య శిబిరంలో 210 మందిని పరీక్షించి వారిలో 55 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు. వారిలో 40 మందికి 17, 18, 19 ,20, తేదీలలో శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించామని, ఫార్మా డిస్ట్రిబ్యూటర్ సహకారంతో సుమారు రూ.3 లక్షల మేర మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. మరో 15 మందికి శస్త్రచికిత్సలను నిర్వహించాల్సి ఉందని, వారికి కూడా రానున్న రెండు రోజులలో పూర్తిచేస్తామని ఆయన తెలియజేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయాలను విజ్ఞానం కోసం సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని, విజ్ఞాన భాండాగారాల్లో విజ్ఞాన సముపార్జ న కోసం గ్రంథాలయాలకు యువత తరచుగా పుస్తక పఠనం కోసం రావాలని పిలుపునిచ్చా రు. గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాల కోసం గ్రంథాలయ అధికారి వద్ద ఉన్న డిమాండ్ పుస్తకంలో తమకు అవసరమైన పుస్తకాల జాబితాను నమోదు చేసుకోవాలని సూచించా రు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి ఆర్.సేవా నాయక్ ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

- మధ్యాహ్న భోజనం మెనూ పక్కాగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



కోడిగుడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల, అంగన్‌వాడీ సెంటర్లోనున్న చిన్నారుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోలి గ్రామంలోని అంగన్‌వాడి సెంటర్, ఎంపీయూపీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించి అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టిహార వివరాలను తెలుసుకున్నారు. కోడిగుడ్డు సైజు తక్కువగా ఉండటం గమనించి, సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. ఫుడ్‌స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించి స్థానిక మండల రెవెన్యూ అధికారిని స్టాక్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఎంపీయూపీ పాఠశాలలో కూడా కోడిగుడ్డు సైజు తక్కువ ఉండటంపై ప్రశ్నించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారో లేదోనని పరిశీలించారు. విద్యార్థులకు బోరు నీళ్లు ఇవ్వడం చూసిన కలెక్టర్ ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైనప్పుడు బబుల్ వాటర్‌ఇవ్వాలని పిల్లల ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలో చిన్నారులకు, విద్యార్థులకు కోడిగుడ్డు సైజ్, నిత్యవసర సరుకులకు సంబంధించిన వివరాలను మండల రెవెన్యూ, విద్యాశాఖాధికారులు పరిశీలించి పూర్తి నివేదికను అందజేయాలని సూచించారు. ఆయన వెంట గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారి రమాకాంత్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జి.కరుణ కుమార్, ఎంఈవో–2 వై.శివనాగేశ్వరరావు తదితరులున్నారు.



విద్యార్థులకు సౌకర్యాలపై హెచ్‌ఎంకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ బి.అరుణ్‌బాబు

రూ.18 లక్షల చెక్కు అందజేత



చల్లా వెంకటలక్ష్మికి చెక్కును అందజేస్తున్న పిడుగురాళ్ల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ భరత్‌కుమార్

పిడుగురాళ్ల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఐఎంఏ సభ్యుడు డాక్టర్ చల్లా వెంకటేశ్వర రెడ్డి భార్యకు మంగళవారం పిడుగురాళ్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 18 లక్షల చెక్కును అందజేశారు. డాక్టర్ చల్లా వెంకటేశ్వరరెడ్డి 1992 నుంచి పిడుగురాళ్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యుడిగా ఉన్నారు. ఐఎంఏ నేషనల్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్ ద్వారా 2024 మే 17న డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి భార్య చల్లా వెంకట లక్ష్మీకి 11,24,500ల చెక్కును అందజేశామన్నారు. తిరిగి ఇప్పుడు డాక్టర్ ఎస్.అప్పారావు ఎఫ్ఎస్ఎస్ ద్వారా రూ. 18 లక్షలచెక్కును అందజేశారు. పిడుగురాళ్ల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దూళ్లిపాళ్ల భరత్‌కుమార్, కార్యదర్శి బొర్రా రాంప్రసాద్, ఐఎంఏ సీనియర్ సభ్యులు బాదం శివారెడ్డితోపాటు చల్లా వెంకట లక్ష్మీ, పెదకుమార్ చంద్రశేఖర్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ గాలి కుంటు నివారణ టీకాలు



మాట్లాడుతున్న పశువైద్యాధికారి షేక్ బషీర్

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం నుంచి జాతీయ గాలి కుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమాలను చేపడుతున్నట్లు మండల పశు వైద్యాధికారి షేక్ బషీర్ అన్నారు. బుధవారం పశువైద్యశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా పశు వైద్య సిబ్బంది మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించి నాలుగు నెలలకు పైబడిన పశువులకు ఉచతంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పాల దిగుబడిని గణనీయంగా తగ్గించి పాడిరైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించే వ్యాధులలో గాలికుంటు వ్యాధి ఒకటన్నారు. పశువులకు జ్వరం, మేత తినకపోవడం, వణుకు రావడం, పాలు తగ్గిపోవడం, పళ్ల కొరకడం, పెదవుల వాపు, చొంగకారడం, నోటిలో పుళ్లు ఏర్పడటం ఈ వ్యాధి లక్షణాలుగా గుర్తించవచ్చునన్నారు. ఈ వ్యాధి పశువులనుంచి మనుషులకు, మనుషులనుంచి పశువులకు గోళ్ల ద్వారా, దుస్తులద్వారా, బూట్లు ద్వారా కూడా వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధికి నిర్దిష్టమైన చికిత్స అంటూ లేదన్నారు. మిట్టగుడిపాడు, గోలి గ్రామాలలో తేలుకుట్ల బాబు, రెంటాల గ్రామంలో రమేష్ నాయక్, పాలువాయి గ్రామంలో భాస్కర్ నాయక్, పశర్లపాడు గ్రామంలో త్రివేణి, మల్లవరం, జెట్టిపాలెం గ్రామాలలో కవిత సెప్టెంబర్ 19 వరకు ఆయా గ్రామాలలో పర్యటించి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తారని తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు



గురజాలలో మైనర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వినోద్ కుమార్

పిడుగురాళ్ల: మైనర్లు వాహనాలు నడిపితేసే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనాలను నడిపే మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించటం జరిగిందన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురజాల: మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వవద్దని ఎస్ఐ వినోద్ కుమార్ సూచించారు. స్థానిక నగర పంచాయతీలోని బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ఎస్పీ ఆదేశాల మేరకు వాహన తనిఖీ చేపట్టడం జరిగిందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అలా ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. విధిగా ప్రతి వాహనదారుడు లైసెన్సు కలిగివుండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేకపోతే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పూర్వవిద్యార్థి దూపాటి కిరణ్ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ కాపీ రైటింగ్ పుస్తకాలను అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి దస్తూరి అలవాటు చేసుకోవాలని సూచించారు. దాత కిరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.